# సింగరేణి బొగ్గుబీళ్ల పాలసీ
# ఓపెనయ్యేకొద్దీ విధ్వంసం

గడచిన అయిదు సంవత్సరాల కాలంలో రాష్ట్రవ్యాప్తంగా పరిశ్రమలకోసం, విమానాశ్రయాలకోసం, ఓడరేవులకోసం, సెజ్‌లకోసం చేపట్టిన భూసేకరణ ఒకెత్తయితే ఉత్తర తెలంగాణ జిల్లాలలో ఓపెన్‌కాస్ట్ బొగ్గుగనుల ప్రాజెక్టులకోసం జరుగుతున్న భూసేకరణ ఒకెత్తు.

ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాలలో సింగరేణి బొగ్గుగనుల కంపెనీ తలపెట్టిన 70 చిల్లర ఓపెన్‌కాస్టు ప్రాజెక్టులకోసం అధికారికంగా 1.00 నుండి 1.50 లక్షల ఎకరాల భూమిని మొదటి దశలో తీసుకోవడం జరుగుతుంది. ఆపైన వాటి డంప్ విస్తరణకోసం కాలక్రమంలో ఇంకొంత భూమి విడతలు విడతలుగా తీసుకుంటారు. వారు తీసుకునేదికాక తీవ్ర కాలుష్యం, నీటికొరత, రాకపోకల అసౌకర్యం తదితర కారణాలుగా ప్రజలే విడిచిపెట్టి లేక అమ్ముకొనిపోయే భూములు మరికొంత ఉంటాయి. ఖమ్మం జిల్లాను దాటి పశ్చిమగోదావరి జిల్లాలోని చింతలపూడి, టి.నర్సాపురం, జీలుగుమిల్లి, బుట్టాయగూడెం మండలాలకూ ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులు విస్తరిస్తాయని వింటున్నాం. ఇవన్నీ లెక్కబెట్టుకొంటే ఎంత లేదన్నా 2 లేక 2.5 లక్షల ఎకరాల భూమి వ్యవసాయానికీ, పశుగ్రాసానికీ, కట్టెపుల్లలకూ, జీవనానికి ఉపయోగపడే ప్రాకృతిక ఉత్పత్తులకూ కాకుండా పోతుంది. ఆదిలాబాద్ జిల్లా ఉత్తర భాగాన మొదలయ్యే ఈ విధ్వంసం ఉత్తరతెలంగాణ సరిహద్దు వెంబడి తూర్పుకు ప్రయాణమై పశ్చిమగోదావరి జిల్లాలో పోలవరం డ్యాం పరిసరాలలో ముగుస్తుంది. అక్కడి నుండి పైకి పోలవరం ముంపు మొదలవుతుంది. అది మళ్లీ దీనిలో సగందాకా ఉంటుంది.

ఇంత విధ్వంసం జరగకుండ ఈ రాష్ట్రం అభివృద్ధి చెందదా?

మన రాష్ట్రంలోని గోదావరి నదీలోయలో ఉన్న బొగ్గు గనులు, ఖనిజాలకు నిలయమైన మధ్యభారత పీఠభూమి దక్షిణపు అంచులో ఉన్నాయి. ఇక్కడ బొగ్గు తవ్వకం 1889 నుండి జరుగుతున్నది. అప్పట్లో బొగ్గు తవ్వకం చేపట్టిన కంపెనీ పేరు హైదరాబాద్ దక్కన్ మైనింగ్ కంపెనీ. ఇది ఇంగ్లండ్‌కు చెందిన కంపెనీ అయినప్పటికీ ఇందులో 75 శాతం పెట్టుబడి హైదరాబాద్ ప్రభుత్వానిదే. ఖమ్మం జిల్లాలోని

**1950లో సింగరేణి బొగ్గు గనులలో 11,600 మంది కార్మికులుండేవారు. 1990ల మధ్యభాగానికి ఈ సంఖ్య 1,15,000 కు చేరింది. గ్రామాలే ప్రధానంగా ఉన్న గోదావరిలోయలో ఇల్లందు, కొత్తగూడెం, గోదావరిఖని, మంచిర్యాల, బెల్లంపల్లిలాంటి పట్టణాలు వెలిసాయి.**

సింగరేణి గ్రామం దగ్గర తవ్వకం మొదలయింది. 1920లో సింగరేణి కాలియరీస్ కంపెనీ (ఎస్.సి.సి) ఏర్పడి గనులను తన చేతిలోకి తీసుకుంది. మొదటినుండి ఈ కంపెనీ హైదరాబాద్ ప్రభుత్వ నియంత్రణలో ఉండేది. కాగా 1944లో దానిని ప్రభుత్వం కొనేసి ప్రభుత్వ సంస్థగా నడపసాగింది. ప్రస్తుతం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి యాజమాన్యంలో ఉంది.

వ్యవసాయకంగా వెనుకబడివున్న ఉత్తర తెలంగాణ ప్రాంతానికి ఈ బొగ్గుగనులు కాల క్రమంలో ఒక ముఖ్యమైన ఉపాధి వనరుగా ఎదిగాయి. మొదట్లో గనులలో పని చాలా కష్టంగా ఉండేది. అండర్‌గ్రౌండ్‌లో విపరీతమైన వేడిలో, సరయిన భద్రత లేకుండా పనిచేయవలసి వచ్చేది. వేతనాలు చాలా తక్కువగా ఉండేవి. ఈ కారణంగా తొలినాడు వేరే ఏ జీవనాధారం లేని నిరుపేదలు మాత్రమే గనులలో పనికి వెళ్ళేవారు. ప్రమాదాలు కూడా తరచుగా జరిగేవి. అయితే కాలక్రమంలో సంఘాలు పెట్టుకొని కొట్లాడి కార్మికులు జీవిత పరిస్థితులను కొద్ది కొద్దిగా మెరుగుపరుచుకోగలిగారు. బొగ్గు గనులకు ఒక ప్రత్యామ్నాయ ఉపాధి కేంద్రంగా గుర్తింపు లభించింది. వేతనాలు కూడా పెరిగి చిన్నరైతుకుటుంబాలలో పుట్టిన వారికి వ్యవసాయంకంటే మెరుగయిన జీవితం బొగ్గుబావులలో లభించింది. 1950లో సింగరేణి బొగ్గు గనులలో 11,600 మంది కార్మికులుండేవారు. 1990ల మధ్యభాగానికి ఈ సంఖ్య 1,15,000 కు చేరింది. గ్రామాలే ప్రధానంగా ఉన్న గోదావరిలోయలో ఇల్లందు, కొత్తగూడెం, గోదావరిఖని, మంచిర్యాల, బెల్లంపల్లిలాంటి పట్టణాలు వెలిసాయి.

అండర్‌గ్రౌండ్ గనులకు కూడా భూసేకరణ అవసరమే. కానీ ఆ అవసరం పరిమితమైనది. ఖనిజం తవ్వకం జరుగుతున్న ప్రాంతమంతా తీసేసుకోవలసిన అవసరం ఉండదు. నేలకింద బొగ్గు తవ్వకం జరుగుతుండగా పైన వ్యవసాయం చేసుకోవచ్చు, ఇళ్ళు వేసుకొని బతకవచ్చు. లోతయిన బోర్లు వేసుకోలేకపోవడం, గనులకు సమీపంలో ఉన్న గ్రామాలలో ఒక్కొక్కసారి భూగర్భ జలాలు ఇంకిపోయి బావులు ఎండిపోవడం జరిగేది. దీనివల్ల స్థానిక ప్రజలకూ సింగరేణి కంపెనీకీ కొంత ఘర్షణ అడపాదడపా జరుగుతూనే ఉన్నా, మొత్తంమీద ఉపాధి అవకాశాలను ప్రత్యక్షంగా, పరోక్షంగా పెంచిన వ్యవస్థగా సింగరేణికి ఉత్తర తెలంగాణ గ్రామీణ ప్రజలలో ఆదరణ లభించింది. ఆ వ్యవస్థ ఉత్పత్తి చేసిన బొగ్గు ఆధారంగా మరిన్ని పరిశ్రమలు నెలకొల్పివుంటే ఉపాధి మరింత లభించి ఉండేది. అయితే కొత్తగూడెం, రామగుండం థర్మల్ విద్యుత్తు కేంద్రాలు, రామగుండంలో ఒక బొగ్గు ఆధారిత ఎరువుల కార్మాగారం, మంచిర్యాల దగ్గర బొగ్గు ఆధారిత రసాయన ఉత్పత్తుల కేంద్రం స్థాపించారు తప్ప స్థానికంగా లభించిన బొగ్గుతో విస్తృతమైన పారిశ్రామికీకరణ చేపట్టే ప్రయత్నం జరగలేదు.

## సంస్కరణల ప్రభావం

1989లో సింగరేణి కంపెనీ బొగ్గు గనుల శతాబ్ది ఉత్సవాలు నిర్వహించింది. ఆ ఉత్సవాల సందర్భంగా ఒక పెద్ద భవిష్యత్ విస్తరణ ప్రణాళికను ప్రకటించింది. 2000 సంవత్సరం నాటికి కొత్తగా

85 అండర్‌గ్రౌండ్ గనులు, 14 ఓపెన్ కాస్ట్ గనులు ప్రారంభించబోతున్నట్లు ఆ ప్రణాళిక చెప్పింది. జిల్లాల వారీగా ఎక్కడ ఎన్ని అనికూడ చెప్పింది. ఆ ప్రణాళిక అమలయివుంటే ఇంకొక 40,000 మందికి అదనంగా పనులు లభించేవి. కానీ 1991లో కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టడంతో ఈ ప్రణాళిక బుట్టదాఖలయి వేరే ప్రణాళిక అమలులోకి వచ్చింది. ఉపాధి కల్పన కాక ఉత్పాదకత పెరుగుదల, ఉత్పత్తి ఖర్చుల తగ్గింపు, ప్రైవేటీకరణ ద్వారా వేతనం బిల్లు తగ్గింపు, యంత్రీకరణ మొదలయినవి ప్రధాన నియమాలయ్యాయి. అండర్‌గ్రౌండ్ గనుల స్థానంలో ఓపెన్‌కాస్ట్ గనులు నెలకొల్పడం, క్రమంగా కొత్త తవ్వకాలు కూడా ఓపెన్‌కాస్ట్ పద్ధతిలో చేపట్టడం, 1990ల మధ్యభాగం నుండి కొత్త రిక్రూట్‌మెంట్‌ను బంద్‌చేసి ఉన్న కార్మికులను వయోభారమనీ అనారోగ్యమనీ క్రమశిక్షణ అనీ తొలగించడం, మిగిలిన వారిపైన పనిభారం విపరీతంగా పెంచడం దీనికి సాధనాలయ్యాయి. దాంట్లో భాగమే ఈ భారీ ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టుల పరంపర.


**1989లో సింగరేణి కంపెనీ బొగ్గు గనుల శతాబ్ది ఉత్సవాలు నిర్వహించింది. ఆ ఉత్సవాల సందర్భంగా ఒక పెద్ద భవిష్యత్ విస్తరణ ప్రణాళికను ప్రకటించింది. 2000 సంవత్సరం నాటికి కొత్తగా 85 అండర్‌గ్రౌండ్ గనులు, 14 ఓపెన్ కాస్ట్ గనులు ప్రారంభించబోతున్నట్లు ఆ ప్రణాళిక చెప్పింది. జిల్లాల వారీగా ఎక్కడ ఎన్ని అనికూడ చెప్పింది. ఆ ప్రణాళిక అమలయివుంటే ఇంకొక 40,000 మందికి అదనంగా పనులు లభించేవి. కానీ 1991లో కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టడంతో ఈ ప్రణాళిక బుట్టదాఖలయి వేరే ప్రణాళిక అమలులోకి వచ్చింది.**

## ఓపెన్‌కాస్ట్‌వల్ల ఏం నష్టం?

మొదట చెప్పుకోవలసింది వాటివల్ల స్థానిక ప్రజలకు ప్రయోజనం ఏమీ లేదని. అండర్‌గ్రౌండ్ బొగ్గు బావులవల్ల కూడ కొంతమేరకు ప్రజలు భూములు కోల్పోయినా, భూగర్భ జలాలపైన కొంత దుష్ప్రభావం ఉన్నా, ఈ నష్టం కంటే ఎక్కువ తూగే ప్రయోజనం ఉపాధి అవకాశాలు, ఆదాయాల పెరుగుదల రూపంలో స్థానిక ప్రజలకు లభించింది. పట్టణాలు వెలసి విద్యావకాశాలూ పెరగడం వల్ల విద్యాప్రమాణాలూ పెరిగాయి. వ్యవసాయాధార జీవితం నుండి ఉద్యోగరంగంలోకి చెప్పుకోదగ్గ సంఖ్యలో స్థానిక యువకులు ప్రవేశించగలిగారు.

ఓపెన్‌కాస్ట్ వల్ల వచ్చే ప్రయోజనం శూన్యం. ఓపెన్‌కాస్ట్ ఉత్పత్తి యంత్రప్రధానమైనది. భారీ యంత్రాలతో కొద్దిమంది పనిచేసే ప్రక్రియ. అందులోనూ ఓవర్‌బర్డెన్ (పైమట్టి) తొలగింపును కాంట్రాక్టర్లకు అప్పగిస్తున్నారు కాబట్టి, కాంట్రాక్టర్లు అత్యధికం బయటి ప్రాంతాలవాళ్ళు కాబట్టి, స్థానికులకు ఆ కొన్ని ఉద్యోగాలలో కూడా ఎక్కువ వాటా దొరకదు. కాంట్రాక్టర్లు పనికోసం తమవాళ్లనే తెచ్చుకుంటారు. ఈ మధ్యన పైమట్టి తొలగింపేకాక బొగ్గు వెలికితీతకూడా కాంట్రాక్టర్లకు అప్పగించాలని సింగరేణి యాజమాన్యం నిర్ణయించింది.

నష్టం మాత్రం అండర్‌గ్రౌండ్ బొగ్గుబావులకంటే ఓపెన్ కాస్ట్‌లు చాలా ఎక్కువ కలుగజేస్తాయి. బొగ్గు మొత్తం పైనుండే తీస్తారు కాబట్టి ఎంత విస్తీర్ణంలో బొగ్గు తవ్వకం జరిగితే అంత విస్తీర్ణంలోనూ భూమిని



కంపెనీకి అప్పగించాలి. అంతేకాదు. బొగ్గు పొరను చేరుకొనే లోపల మట్టి చాలా వస్తుంది. ఈ పైమట్టిని (ఓవర్‌బర్డెన్ లేక ఓ.బి.) తీసి పక్కనే కుప్పలుగా పోస్తారు. దీనిని ఓ.బి.డంప్ అంటారు. దీనికోసం విడిగా భూమికావాలి. అది కాక ఒక్కొక్క గనిదగ్గరా కంపెనీ కార్యాలయాలు వగైరాలకు భూమి కావాలి. చుట్టూ 'క్లియరెన్స్'కు చాలా భూమి కావాలి. ఒక ఉదాహరణ తీసుకుంటే విషయం స్పష్టం అవుతుంది. ఆదిలాబాద్ జిల్లా ఇందారం దగ్గర ఓపెన్‌కాస్ట్ గనికోసం భూసేకరణ ప్రకటన రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. ఆ ప్రాజెక్టుకు అవసరమైన భూమి వివరాలు ఇట్లా ఉన్నాయి. బొగ్గు క్వారీకోసం 870 ఎకరాలు, ఓ.బి.డంప్‌కోసం 625 ఎకరాలు, క్లియరెన్స్‌కోసం రెండింటిచుట్టూ మరో 375 ఎకరాలు, బిల్డింగ్‌లు వగైరాలకోసం 75 ఎకరాలు వెరసి 1875 ఎకరాలు అవసరమని తేల్చారు. అన్ని ప్రాజెక్టులూ ఇంతే పరిమాణంలో ఉండవు కాబట్టి ఒక్కొక్క దానికీ 1500 నుండి 2000 ఎకరాల దాకా భూమి కావాలని భావించవచ్చు. ప్రస్తుతం ప్రతిపాదనలో ఉన్న 70 చిల్లర ఓపెన్‌కాస్ట్‌లకు మొత్తం 1.50 లక్షల ఎకరాల దాకా అవసరం అవుతుంది. కొన్ని వందల గ్రామాలు పూర్తిగా పోతాయి. ఆదిలాబాద్ జిల్లాలోనయితే 50వేల జనాభావున్న రామకృష్ణాపూర్, 1లక్ష జనాభావున్న బెల్లంపల్లి పట్టణాలు ఖాళీ అయ్యేసూచనలున్నాయి. మొదటి దశలో చేసే భూసేకరణతో పని అయిపోదు. బొగ్గుతవ్వేకొద్దీ మట్టి ఇంకా వస్తూనే ఉంటుంది కాబట్టి కొంతకాలానికి ఓ.బి. డంప్‌కు ఇంకా భూమి కావలసి ఉంటుంది. క్వారీ విస్తీర్ణాన్ని కూడా – బొగ్గు లభ్యతనుబట్టి పెంచవచ్చు. కాబట్టి ఒక్కొక్క ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టుకోసం విడతలు విడతలుగా భూసేకరణ చేస్తూపోయే అవకాశం చివరికి 1.50 లక్షల ఎకరాల దగ్గర మొదలయిన భూసేకరణ 2.00 లేక 2.50 లక్షల ఎకరాల దాకా పోవచ్చు.

ఖాళీఅయిన గ్రామాలు పోగా చుట్టు పక్కల ఉన్న గ్రామాల పరిస్థితి ఏమిటి? ఓ.బి. డంప్‌లు పెద్ద మట్టి గుట్టలు. వాటిని ఎప్పటికప్పుడు తడుపుతూ ఉండాలనీ వాటిపైన చెట్లు పెట్టాలనీ కంపెనీని ప్రభుత్వం ఆదేశించినట్టు పత్రికలలో చదువుతుంటాం. ఓపెన్‌కాస్ట్ తవ్వకం అయిపోయిన తరువాత ఓ.బి. డంప్‌లోని మట్టితోనే ఆ బొందను నింపబోతారని కూడా వింటున్నాం. (ఇవి రెండూ ఎట్లా జరుగుతాయో మాత్రం తెలీదు). వాస్తవానికి జరిగేదేమిటంటే ఆ మట్టిగుట్టలు అట్లాగే ఉంటాయి. వాటిని అప్పుడప్పుడే తప్ప నిరంతరాయంగా నీళ్ళతో తడపరు. ఆ మట్టి ఎండకు ఎండి గాలికి ఎగిరి వర్షాలకు బురదయి చుట్టుపక్కల ఇళ్ళనూ పొలాలనూ అన్ని సీజన్లలోనూ పాడుచేస్తుంటుంది. ఇదికాక బొగ్గును

తవ్వడానికి చేసే బ్లాస్టింగ్ ఒక పెద్ద సమస్య. దగ్గరలో ఉన్న ఇళ్లగోడలు బీటలువారడం, కొంతకాలానికి కూలిపోవడం, ఓపెన్‌కాస్ట్ గనుల సమీపంలోని అన్ని గ్రామాల అనుభవమూ. కరీంనగర్ జిల్లాలోని రామగుండం ఓ.సి.పి-4 వల్ల ఇళ్ళు బీటలువారిన మేడిపల్లి, ఖమ్మం జిల్లాలోని మణుగూరు సెంటినరీ ఓసిపి విస్తరణవల్ల బీటలు వారడమేకాదు ఇళ్లు కూలిపోయిన పినపాక మండలం శ్రీరంగాపురం దీనికి ప్రత్యక్ష నిదర్శనాలు. మామూలుగా బ్లాస్టింగ్ వల్ల ఇంటిగోడలు నెర్రెలుబారినట్టు సింగరేణి కంపెనీ ఒప్పుకోదు. మీరు నాసిరకం వస్తువులతో ఇళు కట్టుకొని నెపం మామీద పెడుతున్నారు అంటుంది. కానీ శ్రీరంగాపురంలోని ఇళ్ల స్థితి ఎంత ఘోరమంటే కంపెనీయే ఒప్పుకోక తప్పలేదు. ఆ ఊరిలోని 90 కుటుంబాలలో మెజారిటీ ఖాళీ చేసి వెళ్ళిపోగా 37 మాత్రం మిగిలాయి. అందరికీ కొంత దూరాన కాలనీ కట్టియ్యడానికి కంపెనీ ఒప్పుకుంది. మూడవ సమస్య భూగర్భ జలాలు ఇంకిపోవడం. ఓపెన్‌కాస్ట్ తవ్వకం భూమిలోనికి పోయేకొద్దీ నీళ్ళు ఊరుతుంటుంది. ఆ నీటిని ఎప్పటికప్పుడు బయటకు తోడి కంపెనీ అవసరాలకోసం వాడుకుంటారు. ఆయా ప్రాంతాలలో నేలలోని పొర స్వభావాన్ని బట్టి కొన్నిచోట్ల దీని ఫలితంగా సమీపంలోని వాటర్ టేబుల్ కుంగిపోగలదు. చివరి సమస్య రాకపోకలకు అంతరాయం. ఒక గ్రామం పక్కన ఓపెన్‌కాస్ట్ గని నెలకొనడం వల్ల ఆ గ్రామానికి పొరుగు గ్రామాలతో, సమీపంలోని రహదార్లతో, నీటివనరులతో, అడవితో ఉన్న సంబంధం తెగిపోవచ్చు. ఇది ఆ గ్రామస్తుల జీవితంపైన, జీవనప్రమాణంపైన తీవ్ర ప్రభావం వేయగలదు.

> **వాస్తవానికి జరిగేదేమిటంటే ఆ మట్టిగుట్టలు అట్లాగే ఉంటాయి. వాటిని అప్పుడప్పుడే తప్ప నిరంతరాయంగా నీళ్ళతో తడపరు. ఆ మట్టి ఎండకు ఎండి గాలికి ఎగిరి వర్షాలకు బురదయి చుట్టుపక్కల ఇళ్ళనూ పొలాలనూ అన్ని సీజన్లలోనూ పాడుచేస్తుంటుంది. ఇదికాక బొగ్గును తవ్వడానికి చేసే బ్లాస్టింగ్ ఒక పెద్ద సమస్య. దగ్గరలో ఉన్న ఇళ్లగోడలు బీటలువారడం, కొంతకాలానికి కూలిపోవడం, ఓపెన్‌కాస్ట్ గనుల సమీపంలోని అన్ని గ్రామాల అనుభవమూ.**

అంటే ఈ 70 చిల్లర ఓపెన్‌కాస్ట్‌ల కోసం జరిగే ఒకటిన్నర లక్షల ఎకరాల భూసేకరణవల్ల ప్రత్యక్షంగా వ్యవసాయ భూములూ ఇళ్లూ కోల్పోయేవారేకాక మళ్ళీ దాదాపు అందులో సగం మంది వాటి పర్యావరణ ప్రభావం వల్ల తమ జీవన ప్రమాణం చెప్పుకోదగ్గ మోతాదులో కోల్పోతారు. ఇది చిన్న విధ్వంసం కాదు.

అకస్మాత్తుగా ఇంత పెద్దెత్తున ఓపెన్‌కాస్ట్ బొగ్గుగని ప్రాజెక్టులు చేపట్టాలని సింగరేణి కాలియరీస్ కంపెనీ ఎందుకు నిర్ణయించింది? ఈ ప్రశ్నకు జవాబు చెప్పడం కష్టం కాదు. 1991లో మొదలయిన ఆర్థిక సంస్కరణల ప్రభావాన్ని పైన ప్రస్తావించాము. దాని గురించి ఇంకొంచెం చెప్పుకుంటే ఈ ప్రశ్నకు జవాబు దొరుకుతుంది. ఆర్థిక సంస్కరణలు ఒక అభివృద్ధి నమూనాతో ముడిపడి ఉన్నాయి. వేగంగా, భారీగా పెట్టుబడులు పెట్టి విదేశీ మార్కెట్‌ను లక్ష్యంగాగల ఉత్పత్తులు ప్రైవేట్‌రంగంలో పెద్దెత్తున చేపట్టాలి, దానికి అవసరమైన సాంకేతిక సామగ్రినీ ప్రక్రియలనూ ఎంత ఖర్చయినా ఆహ్వానించాలి, దానికి కావలసిన సకల సదుపాయాలూ మౌలిక వసతులూ ప్రభుత్వం సమర్థంగా విరివిగా చవకగా తన బాధ్యతగా కల్పించాలి అనేది ఈ అభివృద్ధి నమూనా. మౌలిక వసతులలో అతిముఖ్యమైనది విద్యుత్తు.

విద్యుత్ ఉత్పత్తికి మనదేశంలో ఇప్పటికీ ప్రధానమూలం బొగ్గు (మొత్తం విద్యుదుత్పత్తిలో 66 శాతం థర్మల్ విద్యుత్తే). అందువల్ల థర్మల్ పవర్‌ప్లాంట్ల స్థాపన, భారీగా బొగ్గు తవ్వకం అత్యవసరమైన విషయాలు. కోస్టల్ కారిడార్‌లో భాగంగా థర్మల్ ప్లాంట్లు తీరంవెంబడి పెద్దెత్తున నెలకొల్పుతున్న విషయం ఇప్పటికే చూసాము (అయితే వాటికి సింగరేణి బొగ్గుకాక బూడిద పాలు తక్కువ ఉండే విదేశీ బొగ్గు అధికంగా వాడుతున్నారు. చుట్టూ పొలాలూ, ఆవాసాలూ ఎక్కువ ఉన్న కారణంగా ఇది అవసరం అయింది). సింగరేణిలో బొగ్గు ఉత్పత్తిని భారీస్థాయిలో చేపట్టాలన్న నిర్ణయం ఈ నేపథ్యంలో తీసుకున్నదే. జనావాసాలు తక్కువ ఉన్న ప్రాంతాలలో బూడిద కాలుష్యం ఎక్కువ ఉన్నా ఫరవాలేదని భావిస్తారు కాబట్టి దేశంలో అటువంటి ప్రాంతాలలో నెలకొల్పే థర్మల్ ప్లాంటులకు ఈ బొగ్గును తరలిస్తారు కాబోలు.

ఈ 70 చిల్లర ఓపెన్‌కాస్టు ప్రాజెక్టులూ వాటి విస్తరణా చేపట్టి గరిష్ఠ ఉత్పాదకత లభించేస్థాయిలో తవ్వుకుంటూ పోతే 20 లేక 30 సంవత్సరాలలో ఓపెన్‌కాస్ట్‌ల ద్వారా తీయగల బొగ్గంతా అయిపోతుంది. ఆ తరువాత ఉత్తర తెలంగాణ పరిస్థితి ఏమిటంటే గోదావరిలోయ ప్రాంతమంతా బొందలు, మట్టిగుట్టలు ఉంటాయి. అక్కడ మళ్ళీ వ్యవసాయం సాధ్యం కావడానికి కొన్ని శతాబ్దాలు పడుతుంది. ఇది అభివృద్ధి పేరిట ఈ ప్రాంత జీవితంపైన జరుగుతున్న దుర్మార్గమైన దాడి తప్ప వేరే ఏంకాదు.

## ప్రతిఘటన

ఇప్పటికి రెండుచోట్ల ప్రజలు ఈ దుర్మార్గాన్ని ప్రతిఘటించి ఆపగలిగారు. ఆ విజయం తాత్కాలికమేనా అన్న సందేహం ఉన్నప్పటికీ దాని గురించి చెప్పుకోవడం అవసరం. ఈ రెండు పోరాటాలూ అత్యంత వెనుకబడిన జిల్లా అయిన ఆదిలాబాద్‌లో జరిగాయి. సాధించిన ప్రజలు సమాజంలో అత్యంత బలహీనులుగా భావించబడే ఎస్‌సి, ఎస్‌టిలు.

**ఈ దశలో ఓపెన్‌కాస్ట్ ప్రతిపాదన వచ్చేసరికి జనం గట్టిగా ఎదురు తిరిగారు. అండర్‌గ్రౌండ్ గనితోనే మాకిన్ని సమస్యలు వచ్చాయి, ఇక ఓపెన్‌కాస్ట్ వస్తే బతకలేం అని అడ్డు తగిలారు. ఏజెన్సీకి వర్తించే చట్టాలను ప్రస్తావించి మా అనుమతి లేకుండా ఎట్లా నెలకొల్పుతారో చూస్తాం అని హెచ్చరించారు. సింగరేణి యాజమాన్యం వెనక్కి తగ్గినట్టే కనిపిస్తోంది. 2008 ఫిబ్రవరిలో జరగవలసిన పర్యావరణ బహిరంగ విచారణను వాయిదా వేసారు. మళ్లీ జరిపే ప్రయత్నం చేయలేదు.**

కాశిపేట, ముత్యంపల్లి గ్రామాలు షెడ్యూల్డు ప్రాంతంలో ఉన్నాయి. వాటి మధ్య ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు ప్రతిపాదన వచ్చేనాటికే ప్రజలు సింగరేణితో గొడవ పడుతున్నారు. అక్కడ 1995లో అండర్‌గ్రౌండ్ గని ప్రారంభం అయింది. 1997 నుండి ఆ గ్రామాలకు నీటి సమస్య మొదలయింది. అన్ని బావులలోనూ నీళ్లు ఇంకిపోయాయి. జనం సింగరేణి పనులు బంద్‌పెట్టించి ఆందోళనకు దిగారు. కంపెనీ యాజమాన్యం ప్రజలతో ఒప్పందానికి వచ్చి గనిలోని ఊటనీటిని ఫిల్టర్ చేసి ఈ గ్రామాలకు పైప్‌లైన్‌ద్వారా సరఫరా చేయడం మొదలుపెట్టింది. అయితే అది ఇంటి అవసరాలకే తప్ప చేలకు కాదు. ఈమధ్య ఫిల్టర్ కూడ సరిగ్గా చేయకపోవడం వల్ల మురికి నీళ్లు వస్తున్నాయి. ఈ దశలో ఓపెన్‌కాస్ట్ ప్రతిపాదన వచ్చేసరికి జనం

గట్టిగా ఎదురు తిరిగారు. అండర్‌గ్రౌండ్ గనితోనే మాకిన్ని సమస్యలు వచ్చాయి, ఇక ఓపెన్‌కాస్ట్ వస్తే బతకలేం అని అడ్డు తగిలారు. ఏజెన్సీకి వర్తించే చట్టాలను ప్రస్తావించి మా అనుమతి లేకుండా ఎట్లా నెలకొల్పుతారో చూస్తాం అని హెచ్చరించారు. సింగరేణి యాజమాన్యం వెనక్కి తగ్గినట్టే కనిపిస్తోంది. 2008 ఫిబ్రవరిలో జరగవలసిన పర్యావరణ బహిరంగ విచారణను వాయిదా వేసారు. మళ్లీ జరిపే ప్రయత్నం చేయలేదు.

నెన్నెల మండలంలోని శ్రావణపల్లి, జెండా వెంకటాపూర్ గ్రామాలు, వాటిని ఆనుకొనివున్న మందమర్రి మండలంలోని మామిడిగట్టు గ్రామం ఒక సంవత్సరంపైగా తమ ఊరిలోకి సింగరేణి అధికారులను అడుగుపెట్టనీయకుండ నిరోధించాయి. ఈ మూడు గ్రామాల భూములలో సింగరేణి ఒక ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు ప్రతిపాదించింది. దీనిని 'శ్రావణపల్లి ఓపెన్‌కాస్ట్' అని ప్రజలు పిలుస్తున్నారు. శ్రావణపల్లి పూర్తిగా లంబాడీ గిరిజనులు నివసించే గ్రామం. జెండా వెంకటాపూర్ వాసులందరూ నేతకాని కులానికి చెందిన దళితులే. మామిడిగట్టు భిన్నకులాలున్న గ్రామం. ఈ గ్రామాలు మామిడి తోటలకు ప్రసిద్ధిగాంచాయి. దాదాపు 4000 ఎకరాల మామిడితోటలున్నాయి. మన ప్రాంతంలో అరుదైన దస్సేరి పండ్లు పండుతాయి. ఒకప్పుడు నాగ్‌పూర్ నుండి దళారులు వచ్చి పండ్లు కొనుక్కొని పోయేవారు గానీ గత అయిదారేళ్లుగా ఈ గ్రామాల యువకులే మామిడి పండ్లను నాగ్‌పూర్ తీసుకుపోయి వ్యాపారం చేయడం నేర్చుకున్నారు. మామిడి కాత బాగా ఉన్న సంవత్సరంలో ఎకరానికి 80 వేల రూపాయలదాకా ఆదాయం పొందుతున్నారు.

ఈ మామిడి తోటలే కాక, మళ్ళీ అంత భూమిలో వరిచేలు కూడ ఉన్నాయి. కుంటలు, బోర్లు ఉన్నాయి. రెండు పంటలూ వరే వేసే భూములూ ఉన్నాయి. ఈ గ్రామాలకు చుట్టుపక్కల అయిదారు గ్రామాల నుండి కూలికి వస్తారు. సమీపంలో అడవులు ఉండడంవల్ల పశుగ్రాసమూ సమృద్ధిగా ఉంది. ఇంటింటికీ 15 నుండి 20 దాకా పశువులున్నాయి.

ఇన్ని కారణాలుగా ఈ వూర్ల ప్రజలు తమ జీవితాలను కాలక్రమంలో బాగు చేసుకొని గౌరవప్రదంగా బతకగలుగుతున్నారు. ఈ స్థితిలో ఓపెన్‌కాస్ట్ ప్రతిపాదన రావడం వీరికి గొడ్డలిపెట్టయింది. మొదటి దినం నుండి దానిని గట్టిగా వ్యతిరేకిస్తూ, సర్వే నిమిత్తం కూడ సింగరేణి అధికారులను రానివ్వకుండ అడ్డుపడుతూ వున్నారు. పోలీసు కేసులయినా ఖాతరు చేయలేదు. అన్ని ప్రజాసంఘాలనూ ఉద్యమకారులనూ పిలిచి నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ ఒత్తిడి ఫలితంగా 'శ్రావణపల్లి ఓ.సి. ప్రాజెక్టు'ను వదులుకున్నట్టుగా సింగరేణి యాజమాన్యం నుండి వారికి సంకేతాలు అందాయి.

**మొదటి దినం నుండి దానిని గట్టిగా వ్యతిరేకిస్తూ, సర్వే నిమిత్తం కూడ సింగరేణి అధికారులను రానివ్వకుండ అడ్డుపడుతూ వున్నారు. పోలీసు కేసులయినా ఖాతరు చేయలేదు. అన్ని ప్రజాసంఘాలనూ ఉద్యమకారులనూ పిలిచి నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ ఒత్తిడి ఫలితంగా 'శ్రావణపల్లి ఓ.సి. ప్రాజెక్టు'ను వదులుకున్నట్టుగా సింగరేణి యాజమాన్యం నుండి వారికి సంకేతాలు అందాయి.**



ఆదిలాబాద్ జిల్లా, తిర్యాని మండలంలోని ఖైరిగూడ ఓపెన్‌కాస్ట్

పూర్తిగా ఆపకపోయినా ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు వల్ల కలిగే నష్టాన్ని ఆందోళన చేసి తగ్గించుకున్న ఉదంతం ఖమ్మం జిల్లా ఇల్లందు పట్టణంలో జరిగింది. జెకె-5 గనిని ఓపెన్‌కాస్ట్‌గా మార్చడానికి సింగరేణి చేపట్టిన భూసేకరణ ఇల్లందు పట్టణంలో 7 వార్డులను మింగేస్తుందని తెలిసి పట్టణ ప్రజలు అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఊరిలో భూసేకరణ ప్రధానంగా ఒ.బి. డంప్‌కోసం. ఇళ్లు కోల్పోయేవారు కోల్పోగా మిగిలిన ఊరు పక్కనే పెద్ద మట్టి గుట్టను పెట్టుకొని ఎండాకాలానికి చెలరేగే ధూళిని భరిస్తూ బతకాలి. ఓపెన్‌కాస్ట్‌లో జరిగే బ్లాస్టింగ్ కాలక్రమంలో ఊరంతటినీ శిథిలం చేసినా ఆశ్చర్యంలేదు. జెకె5లో అండర్‌గ్రౌండ్ పద్ధతిలో ఇంకా కొంతకాలం బొగ్గు తవ్వితీసే అవకాశం ఉన్నా కంపెనీ దానిని ఓపెన్‌కాస్ట్‌గా మార్చాలని ఎందుకు నిర్ణయించిందన్న ప్రశ్నకు జవాబేమీ లేకున్నా, ఆందోళన ఫలితంగా భూసేకరణను తగ్గించడమయితే జరిగింది. ఇప్పుడు ఇల్లందు పట్టణంలో 7 వార్డులు కాదు, 2 మాత్రమే పోతాయి. అయినప్పటికీ ఆ పట్టణ భవిష్యత్తు ప్రశ్నార్థకంగానే ఉండిపోయింది.

ఇల్లందు జెకె-5 గని ఒక్కటే కాదు, చాలా చోట్ల ఇప్పుడొస్తున్న ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులు నడుస్తున్న అండర్‌గ్రౌండ్ గనులను ఓపెన్‌కాస్ట్‌గా మార్చే ప్రయత్నంలో భాగంగా నెలకొంటున్నవి. అండర్‌గ్రౌండ్ పద్ధతిలో బొగ్గు తీయగలిగినంతా తీసేసి దానిని మూసేసే స్థితి వచ్చినప్పుడు ఓపెన్‌కాస్ట్ పద్ధతిలో కొనసాగించడం ఓపెన్‌కాస్ట్‌లను సమర్థించుకోవడానికి ఒకనాడు చేసిన వాదన. కానీ ఇప్పుడు ఇంకా చాలాకాలం అండర్ గ్రౌండ్ పద్ధతిలో నడవగల గనులను ఓపెన్‌కాస్ట్‌లుగా మారుస్తున్నారు. ఇప్పటిదాకా పనిచేస్తున్న వందలమంది కార్మికులను తొలగించి చుట్టుపక్కల గ్రామాలనూ వ్యవసాయ భూములనూ ఖాళీ చేయించి అధిక ఉత్పత్తినీ అధిక ఉత్పాదకతనూ నమోదు చేసుకుంటున్నారు. వరంగల్ జిల్లాలోని భూపాలపల్లిలోనయితే 3ఎ ఇంక్లయిన్‌ను 2008 ఏప్రిల్ నెలలో ఆర్భాటంగా ఆవిష్కరించినట్టు చేసి ఉత్పత్తి మాత్రం మొదలుపెట్టకుండ దానిని ఓపెన్‌కాస్ట్‌గా మార్చే ప్రయత్నం మొదలుపెట్టారు.

## ఆదివాసుల హక్కులు

అప్పుడెప్పుడో వచ్చిన అండర్‌గ్రౌండ్ గనులు ఎక్కువ భాగం (ముఖ్యంగా ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాలలో) ఆదివాసీ ప్రాంతాలలోనే ఉన్నాయి. అప్పుడు వారికి రక్షణ కల్పించే చట్టాలు లేవు. వారిని అడవులలోకి నెట్టేసి గనులు ఏర్పాటు చేసారు. గనులలో ఒక్క ఆదివాసీకీ పని దొరకలేదు. ఇవ్వాళ్టికీ సింగరేణి గని కార్మికులలో ఆదివాసులు అతితక్కువ. రేపు జరగబోయే ఓపెన్‌కాస్ట్ విస్తరణ మరొక విడత భారీగా ఆదివాసుల భూములను కబళించబోతుంది. ఇప్పుడెలాగూ పనులు స్థానిక ప్రజలెవరికీ పెద్దగా దక్కబోయేది లేదు కాబట్టి భూములు కోల్పోయే ఆదివాసులకూ దక్కవు. అయితే ఇప్పుడు ఆదివాసులకు బలం కల్పించే చట్టాలున్నాయి. వాటిని పాలకులు గౌరవించి ఉంటే ఈ విస్తరణ జరిగేదేకాదు. ప్రజలు వాటిని అర్థం చేసుకొని సంఘటితమై అడ్డుపడినా నిలిచిపోతుంది కానీ ఆ చట్టాల గురించి ప్రజలకేకాదు, వారి తరఫున మాట్లాడుతున్న పార్టీలకూ, ప్రజాసంఘాలకూ కూడ అవగాహన లేదు.

షెడ్యూల్డు ప్రాంతాలకు పెసా (PESA) చట్టం వర్తిస్తుంది. పెసా అనేది కేవలం చట్టం కాదు, రాజ్యాంగ ఆదేశం. 73వ రాజ్యాంగ సవరణ ద్వారా దేశంలోని పంచాయతుల రూపురేఖలకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించినప్పుడు, దానిని షెడ్యూల్డు ప్రాంతాలకు వర్తింపజేయకుండ ఆ పని తగురీతిలో పార్లమెంట్ చేస్తుందని అనడం జరిగింది. 1996లో పెసా చట్టం ద్వారా పార్లమెంటు 73వ రాజ్యాంగ సవరణను షెడ్యూల్డు ప్రాంతాలకు విస్తరింపజేసింది. ఆదివాసుల ప్రత్యేక స్థితిని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక అంశాలను చేర్చింది. వాటిలో ప్రస్తుతానికి వర్తించేవి రెండు. ఒకటి షెడ్యూల్డు ప్రాంత గ్రామసభకు 'ప్రజల సంప్రదాయాలనూ, ఆచారాలనూ, సాంస్కృతిక ప్రత్యేకతలనూ, ఉమ్మడి వనరులనూ' కాపాడే అధికారం సంరక్షించే అధికారం ఉంది. 'ఉమ్మడి వనరులు' అనేదానిలో గ్రామకంఠం, బీళ్ళు, పోరంబోకులు, నీటివనరులు, అడవులు వస్తాయని వివరించి చెప్పనవసరం లేదు. వీటిని కాపాడే అధికారం సంరక్షించే అధికారం గ్రామసభకు ఉన్నాయి అంటే అర్థం గ్రామ సభ సమ్మతి లేకుండ వాటిని ప్రభుత్వం సహితం వేరే అవసరాలకోసం తీసేసుకోవడానికి, వినియోగించడానికి వీలులేదని. రెండు, ఏ అభివృద్ధి పథకం కోసమయినా భూసేకరణ చేసేముందు, వాటివల్ల నిర్వాసితులయ్యే ప్రజలకు పునరావాసం కల్పించేముందు స్థానిక మండల పరిషత్‌ను సంప్రదించాలి. ఇక్కడ సంప్రదింపు అనేది మొక్కుబడిగా ఉండడానికి వీలులేదు. అర్థవంతమైన సంప్రదింపు జరగాలంటే ప్రాజెక్టుకూ పునరావాసానికీ సంబంధించిన పూర్తి సమాచారాన్ని సంబంధిత మండల పరిషత్ ముందు ఉంచి తగు హెూదాగల అధికారి మండల పరిషత్ సమావేశానికి హాజరై వారికి అన్నీ వివరించి, వారి ప్రశ్నలకు జవాబులు చెప్పి వారి అభిప్రాయం కోరాలి.

ఇవి పెసానుండి వచ్చిన హక్కులు కాగా అటవీ హక్కుల చట్టం (షెడ్యూల్డు తెగలు, ఇతర సంప్రదాయ అటవీవాసుల అటవీ హక్కుల గుర్తింపు చట్టం) అడవులలో ఆదివాసులకూ, మూడు తరాలుగా అడవిపైన ఆధారపడి బతుకుతున్న ఆదివాసీయేతరులకూ ఇచ్చిన హక్కులను లెక్కలోకి తీసుకోకుండ కూడ భూసేకరణ జరగడానికి వీలులేదు. 2005 డిసెంబరు 13 వ తేదీకి ముందు ఎన్నడైనా అడవులలో అనుభవించిన సకల హక్కులకూ ఈ చట్టం గుర్తింపు ఇస్తుంది. అందులో సమిష్టి హక్కులూ ఉన్నాయి, వ్యక్తిగత హక్కులూ ఉన్నాయి. అంటే పోగొట్టుకున్న భూములకు పట్టాయేకాక ఒక గూడెం ప్రజలు సమిష్టిగా పశువులను మేపుకున్న భూభాగం మీద, సమిష్టిగా చేపలు పట్టుకున్న నీటి వనరుల మీద, సమిష్టిగా చిన్నతరహా అటవీ ఉత్పత్తులు సేకరించిన అటవీక్షేత్రం మీద కూడ సమిష్టి 'పట్టాలు' లభిస్తాయి.

## 'పెసా' చట్టం

'పెసా' చట్టం పూర్తి పేరు 'పంచాయత్స్ ఎక్స్‌టెన్షన్ టు షెడ్యూల్డ్ ఏరియాస్' చట్టం.

దేశ రాజ్యాంగం రాసినప్పుడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించారుగానీ స్థానిక సంస్థల అధికారాలకు కల్పించలేదు. వాటి అధికారాలను రాష్ట్ర ప్రభుత్వాల ఇష్టానికి వదిలేసారు. ఇది స్థానిక సంస్థలను చాలా బలహీనపరిచిందని గుర్తించి 1992లో 73, 74వ రాజ్యాంగ సవరణల ద్వారా పంచాయతులకు, మునిసిపాలిటీలకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించారు. అయితే ఈ సవరణలను షెడ్యూల్డు ప్రాంతాలకు వర్తింపజేయలేదు. వాటిని షెడ్యూల్డు ప్రాంతాలకు ఉన్నదున్నట్టు కాకుండ ఆదివాసీ ప్రజల అవసరాలనూ, ఆకాంక్షలనూ దృష్టిలో ఉంచుకొని తగిన పద్ధతిలో సవరించి వర్తింపజేయాలని భావించారు. భవిష్యత్తులో పార్లమెంటు ఆ పని చేస్తుందని 73, 74వ రాజ్యాంగ సవరణలు అంటాయి. మునిసిపాలిటీల విషయంలో ఇది ఇప్పటికీ జరగలేదుగానీ, పంచాయతుల విషయంలో పార్లమెంటు భూరియా కమిటీ ప్రతిపాదనలను లెక్కలోకి తీసుకొని 1996లో పెసా చట్టం ద్వారా 73వ రాజ్యాంగ సవరణను షెడ్యూల్డు ప్రాంతాలకు విస్తరింపజేసింది.

వివిధ పాలనాంశాలలో ఆదివాసీ ప్రాంత గ్రామసభకూ పంచాయత్‌రాజ్ వ్యవస్థలకూ స్వయంప్రతిపత్తి కల్పిస్తూ ఆయా రాష్ట్రాల పంచాయత్‌రాజ్ చట్టాలను తిరగరాయాలని 'పెసా' చట్టం రాష్ట్రాలను ఆదేశిస్తుంది. ఈ స్వయంప్రతిపత్తి స్వభావాన్ని 'పెసా' చట్టంలోని సెక్షన్ 4(డి) సూచిస్తుంది. అదేమిటంటే గ్రామసభకు 'ప్రజల సంప్రదాయాలు, ఆచారాలు, సాంస్కృతిక ప్రత్యేకతలు, ఉమ్మడి వనరుల'ను కాపాడుకునే హక్కు ఉంటుందనేది. ఉమ్మడి వనరులలో ఊరిచుట్టూ ఉన్న భూమి, అడవులు, నీటివనరులు వస్తాయి. ఈ సాధారణ అధికారమే కాక, భూసేకరణ చేసేముందు, నిర్వాసితుల పునరావాసం చేపట్టేముందు గ్రామసభనుగానీ పంచాయితీరాజ్ వ్యవస్థలో నిర్దేశిత స్థాయి వ్యవస్థను గానీ తప్పనిసరిగా సంప్రదించాలన్న నియమం కూడ సెక్షన్ 4(ఐ) కల్పించింది. మన రాష్ట్రానికి సంబంధించినంత వరకు ఈ 'నిర్దేశితస్థాయి వ్యవస్థ' మండల ప్రజాపరిషత్.

ఈ పట్టాలు మంజూరు చేసేక్రమం ఇప్పుడిప్పుడే మొదలయింది. అది పూర్తయి హక్కుల నిర్ధారణ సమగ్రంగా జరిగేదాకా అటవీ ప్రాంతాలలో ఎటువంటి భూసేకరణా జరగడానికి వీలులేదు.

ఈ చట్టాలను పాటిస్తే సింగరేణి యాజమాన్యం తలపెట్టిన ఓపెన్‌కాస్ట్ విస్తరణ మూడవవంతు కూడ సాధ్యమయ్యేదికాదు. ఆదిలాబాద్ జిల్లాలోనూ వరంగల్ జిల్లాలోనూ చేపడుతున్న ఓపెన్‌కాస్టులు కొన్ని, ఖమ్మం జిల్లాలో చేపడుతున్న దాదాపు అన్నీ (సత్తుపల్లి దగ్గర నెలకొంటున్న ఓ.సి.పి-2 తప్ప అన్నీ) షెడ్యూల్డు ప్రాంతంలో, అడవి ప్రాంతంలో ఉన్నాయి. పైన చెప్పిన చట్టాల గురించి, అవి కల్పించే హక్కుల గురించి అడిగేవాళ్ళెవరూ లేరు కాబట్టి ఏ గ్రామసభ అనుమతీ తీసుకోకుండ, ఏ మండల పరిషత్‌నూ సంప్రదించకుండ, అటవీ హక్కుల గుర్తింపు కోసం ఆగకుండ భూములు తీసేసుకుంటున్నారు. పోలవరంవల్ల ఏడు మండలాలలో (వేలేరుపాడు, కుక్కునూరు, బూర్గుం పాడు, భద్రాచలం, కూనవరం, వరరామ చంద్రాపురం, చింతూరు) భారీగా భూములు కోల్పోతున్న ఖమ్మం జిల్లా ఆదివాసులు

# పట్టణాలే మాయం

రామకృష్ణాపూర్ ఆదిలాబాద్ జిల్లా 'కోల్‌బెల్ట్'లోని పెద్ద ఊర్లలో ఒకటి. 50 వేల జనాభా ఉన్న ఈ ఊరిలో దానికి దగ్గర ఉన్న గనులలో పనిచేసే కార్మికులేకాక, మందమర్రి, శ్రీరాంపూర్‌లలో పనిచేసే కార్మికులు కూడ నివసిస్తున్నారు. అక్కడున్న సింగరేణి ఏరియా ఆస్పత్రి బాగా పెద్దది కూడా అయితే ఆ ఊరి భూమంతా అప్పుడెప్పుడో సింగరేణికి ప్రభుత్వం ఇచ్చినదే. కంపెనీయే ఇళ్ళస్థలాలు ఇచ్చి ఉచిత కరెంటు ఇచ్చి కార్మికులు నివాసాలు ఏర్పరుచుకోవడాన్ని ఒకనాడు ప్రోత్సహించింది. ఇప్పుడొక పెద్ద బజారు, స్కూళ్ళు తదితర వసతులతో రామకృష్ణాపూర్ ఒక పెద్ద ఊరయింది. ఆ ఊరికిప్పుడు చేటొచ్చింది. సింగరేణి యాజమాన్యం ఓపెన్‌కాస్ట్‌ల గురించి పారదర్శకంగా ఏమీ చెప్పదు. అకస్మాత్తుగా భూసేకరణ ప్రకటనో, బుల్‌డోజర్లో వచ్చిన రోజు తెలుసుకోవాలి. అయితే అందులో పనిచేసే ఉద్యోగుల ద్వారా కొంత సమాచారం తెలుస్తూనే ఉంటుంది. తెలిసిన సమాచారం ప్రకారం, మూసేసిన ఆర్‌కె1, ఆర్‌కె3, ఆర్‌కె4 గనులను ఓపెన్‌కాస్ట్‌లుగా పునరుద్ధరించి, నడుస్తున్న ఎంకె 4, ఎంకె 4ఎ గనులను కూడ ఓపెన్‌కాస్ట్‌లుగా మార్చి ఒక బృహత్ ఓ.సి. ప్రాజెక్టు తయారు చేసే ఆలోచనలో సింగరేణి ఉంది. తొలుత ఈ ప్రాజెక్టుకు ఓ.బి. డంప్‌ను రామకృష్ణాపురం ఊరున్నచోట నెలకొల్పాలన్న ఆలోచన ఉండిందిగానీ ఇది బయటకు పొక్కి కొంత అల్లరి జరిగేసరికి ఊరిబయట, మందమర్రి శ్రీరాంపూర్ రోడ్డుకు ఆవల డంప్ నెలకొల్పబోతున్నట్లు కంపెనీ సంకేతాలు ఇచ్చింది. అయినప్పటికీ ధూళివల్ల, బ్లాస్టింగ్‌వల్ల, రోడ్డుకు ఇవతల ఉన్న ఆర్‌కె4 గడ్డ, శాంతినగర్ కాలనీలలో నివాసం అసాధ్యం అవుతుంది. అక్కడి జనాభా 15 నుండి 20 వేలదాకా ఉంటుంది. కాలక్రమంలో ఊరే ఖాళీ చేయవలసిరావచ్చు.

బెల్లంపల్లి ఇంకా పెద్దఊరు. ఒక లక్ష దాకా జనాభా ఉన్న ఊరు. ఆ ఊరిని క్రమంగా ఖాళీ చేయించే ఆలోచన సింగరేణి యాజమాన్యానికి ఉన్నట్లు అనేక సంకేతాలు లభిస్తున్నాయి. 1976లో ఒక ప్రమాదం కారణంగా మూసేసిన 2 ఇంక్లయిన్ గనిని కేంద్రం చేసుకొని ఒక భారీ ఓపెన్‌కాస్ట్‌ను తయారుచేసే ఆలోచన ఉందని కార్మికుల అనుమానం. ఆ ఊరిలో కార్మికుల క్వార్టర్స్ 5000 దాకా ఉన్నాయి. ఇప్పుడు బెల్లంపల్లికి అనుబంధంగా గనులు లేవు. అబ్బాపూర్, ఖైరిగుడ, డొర్లి, గోలేటి తదితర ప్రాంతాలలోని గనుల కార్మికులకు ఈ క్వార్టర్స్ నివాసాలుగా కేటాయించేవారు. ఇప్పుడు ఒక్కొక్కటి ఖాళీ చేయిస్తున్నారు. పాడయిన వాటిని రిపేర్ చేయడం లేదు. ఖాళీ అయిన వాటిని వేరే ఎవ్వరికీ కేటాయించడం లేదు. నీటి సరఫరా రెండు మూడు రోజులకొకసారి చేస్తున్నారు. హైస్కూల్‌ను, డిస్పెన్సరీని, టింబర్‌యార్డ్‌ను, స్టోర్స్‌ను, ఏరియా వర్క్‌షాప్‌ను గడచిన నాలుగైదు ఏళ్లలో ఒకటొకటిగా మూసేసారు. 608 పడకలు ఉండిన ఏరియా ఆస్పత్రిలో పడకల సంఖ్యను 250 కి తగ్గించేసారు. ఇక్కడ భూమంతా ఏనాడో ప్రభుత్వం సింగరేణికి అప్పగించింది కాబట్టి వారి అనుమతి లేకుండ ప్రభుత్వ కార్యాలయాలు సహితం ఆ ఊరిలో కట్టుకోవడానికి వీలులేదు. ఆ అనుమతి సింగరేణి ఇవ్వడంలేదు. చివరికి బెల్లంపల్లి మునిసిపాలిటీకి సహితం తన కార్యాలయంకోసం బిల్డింగ్ కట్టుకోవడానికి కంపెనీ అనుమతి నిరాకరించింది!

ఒక లక్ష జనాభాగల ఊరిని మెల్లమెల్లగా గొంతు నులిమి చంపేసి అక్కడ భారీ ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు నెలకొల్పాలని సింగరేణి యాజమాన్యం ప్రయత్నిస్తున్నదనడానికి ఇవన్నీ సంకేతాలే. అయితే కంపెనీ మాత్రం నోరువిప్పదు.

**పోడు కొట్టుకోవడం నిన్నటిదాకా నేరం అని మాత్రమే వారికి తెలుసును. అయినా ఊరికే ఖాళీచేయమంటే ప్రతిఘటిస్తారుగానీ ఏదో కొంచెం చేతిలో పెడితే ప్రభుత్వం ఎంత దయగలది అనుకొని ఖాళీ చేయగలరు. కోయగూడెం ఓ.సి.పి-2 కోసం టేకులపల్లి మండలంలోని లచ్చగూడెం అనే కోయ గ్రామంలో 250 ఎకరాల పోడుభూమిని ఎకరానికి 5వేల రూపాయలు చేతిలోపెట్టి అన్యాయంగా సింగరేణి స్వాధీనం చేసుకుంది.**

ఓపెన్‌కాస్ట్‌ల వల్ల మరొక 5 మండలాలలో (ఇల్లందు, గుండాల, టేకులపల్లి, మణుగూరు, పినపాక) భూములు కోల్పోతారు. ఇది అడవి ప్రాంతం కాబట్టి ప్రతీ గ్రామంలోనూ పోడు భూములున్నాయి. అటవీ హక్కుల చట్టం ఒకటి వచ్చిందని, దానికింద పోడు భూములకు పట్టా లభిస్తుందని తెలియని ఆదివాసుల నుండి పోడు భూములు గుంజుకోవడం ప్రభుత్వానికి చాలా సులభం అయింది. పోడు కొట్టుకోవడం నిన్నటిదాకా నేరం అని మాత్రమే వారికి తెలుసును. అయినా ఊరికే ఖాళీచేయమంటే ప్రతిఘటిస్తారుగానీ ఏదో కొంచెం చేతిలో పెడితే ప్రభుత్వం ఎంత దయగలది అనుకొని ఖాళీ చేయగలరు. కోయగూడెం ఓ.సి.పి-2 కోసం టేకులపల్లి మండలంలోని లచ్చగూడెం అనే కోయ గ్రామంలో 250 ఎకరాల పోడుభూమిని ఎకరానికి 5వేల రూపాయలు చేతిలోపెట్టి అన్యాయంగా సింగరేణి స్వాధీనం చేసుకుంది.

బాధితులకిచ్చే పునరావాసం గురించి ప్రభుత్వము, సింగరేణి యాజమాన్యము చాలా చెప్తుంటారు కాబట్టి ఖమ్మం జిల్లా మణుగూరు ఓ.సి. ప్రాజెక్టు బాధిత ఆదివాసీ గ్రామమైన కొండాపురం కథ చెప్పుకొని ముగిద్దాం. మణుగూరు దగ్గర సింగరేణి శతాబ్ది సందర్భంగా 1989లోనే సెంటినరీ ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు వచ్చింది. ఆ తరువాత దాని పక్కనే మరికొన్ని ఓపెన్‌కాస్ట్‌లు ప్లాన్ చేసి చివరికి అన్నిటినీ కలిపి ఒకే పెద్ద మెగా ఓ.సి.పిని తయారు చేస్తున్నారు. దీనికి కావలసిన భూమిని ఎగ్గడిగూడెం, గుండ్లసింగారం, పద్మగూడెం, కొమ్ముగూడెం, మల్లెపల్లి గ్రామాలనుండి తీసుకుంటున్నారు. గనికోసం, ఓ.బి. డంప్‌కోసం, కార్యాలయాలు వగైరా అవసరాల కోసమేకాక మరొక దాని కోసం కూడా ఇక్కడ భూమి అవసరమయింది. ఈ ఓపెన్‌కాస్ట్‌కు దగ్గరగా గోదావరి నది ప్రవహిస్తుంది. ఈ ప్రాజెక్టు లెవెల్ గోదావరి వరద నీటిమట్టంకంటె తక్కువ ఉండడంతో గోదావరి వెంబడి మట్టికట్ట వేయవలసి వచ్చింది. దానికోసమూ భూమి సేకరిస్తున్నారు. నదినుండి పైపులైన్‌లు వేసుకొని పొలాలకు సాగునీరు తెచ్చుకుంటున్న గ్రామస్తులకు ఇంక ఆ అవకాశం ఉండదు.

ఇది ఇవ్వాల్టి సంగతి కాగా, 1996లోనే సెంటినరీ ఓసి ప్రాజెక్టు ఓ.బి. డంప్ కోసం అదనంగా భూమి అవసరమయి 42 ఆదివాసీ కుటుంబాలున్న కొండాపురాన్ని ఖాళీ చేయించారు. మణుగూరు దగ్గర కాలనీ కట్టిస్తామనీ, అందరికీ వ్యవసాయ భూములిస్తామనీ, ఉద్యోగాలిస్తామనీ హామీ యిచ్చారు. కనీసం ఇంటిస్థలం కూడ ఇయ్యకపోయేసరికి కొండాపురం ప్రజలు ప్రత్యక్షచర్యకు దిగారు. 1996 డిసెంబర్ 11 నుండి 26 దాకా ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు పనులకు అడ్డంపడి బంద్ పెట్టించారు. అప్పుడు మణుగూరును అనుకొని ఒక్కొక్క కుటుంబానికి 5సెంట్ల ప్లాట్ ఇచ్చి ఇల్లు కట్టుకోవడానికి తలా 40 వేల రూపాయలిచ్చారు. అది చాలకపోతే అందరూ అదనంగా ఖర్చుపెట్టుకొని ఇళ్ళు కట్టుకొని కాలనీకి

‘కొత్తకొండాపురం’ అని పేరు పెట్టుకున్నారు. ఉద్యోగాలిస్తామన్నారు కదా ఇమ్మంటే రిక్రూట్‌మెంట్ జరిగేటప్పుడు అందరితోపాటు పరుగుపందెంలో పాల్గొనండి ఇస్తాం అన్నారు. పరుగుపందెంలో సఫలమైతే ఎట్లాగూ ఇచ్చేదేకదా, మీరు నిర్వాసితులుగా మాకు ఇచ్చిందేమిటి అని కొండాపురం ఆదివాసులు అభ్యంతరం తెలిపారు. అట్లాగయితే కరీంనగర్‌లో, ఆదిలాబాద్‌లో ఉన్న గనులలో పోయి పనిచేయండి అన్నారు. మా భూములు మీరు గనికోసం తీసుకొని మమ్మల్ని వేరే జిల్లాకు పొమ్మంటే ఎందుకు పోతాం అని జనం గొడవపెట్టుకున్నారు. చివరికి ఉద్యోగాలిచ్చేది లేదనీ, దాని బదులు 60,000 రూపాయలిస్తామనీ, అయితే ఇది స్వంత భూమి ఉండిన 17 కుటుంబాలకు మాత్రమే పరిమితం అనీ సింగరేణి అనింది. పోడుభూమి మీద బంజరు భూమి మీద ఆధారపడి బతికిన తక్కిన 25 కుటుంబాలవారు కూడ జీవనం కోల్పోయినప్పటికీ వారికేమీ ఇవ్వనని౦ది. ఉద్యోగాల ప్రహసనం అట్లా ముగిసింది. ఇక భూముల విషయానికి వస్తే – మొదట ప్రభుత్వం ఒక్కొక్క కుటుంబానికి 2 ఎకరాల భూమి ఇస్తానంది. స్వంత భూమి ఉండిన 17 కుటుంబాలకు 1998లో సాగు యోగ్యమైన భూమే ఇచ్చింది గానీ మిగిలిన వారికి మరొక నాలుగేళ్ళు తిప్పించుకొని 2002లో రాళ్లు రప్పలతో నిండిన భూమి ఇచ్చింది. కానీ సాగు యోగ్యమైన భూమి పొందిన 17 కుటుంబాల వారికే అంతా సజావుగా జరగలేదు. దున్నుకుందామని పోతే ఇచ్చిన 2 ఎకరాలూ ఒకచోట లేవనీ ఇక్కడ కొంచెం అక్కడ కొంచెం ఉన్నాయనీ గమనించారు. పోనీలే దున్నుకుందామని ప్రయత్నించగా గిరిజనేతరులు అడ్డుతగిలి అది తమ భూమి అన్నారు. భూమి పొందిన గిరిజనులు ఈ సంగతి మణుగూరు ఎంఆర్‌వో (తాసీల్దార్)కూ ఎస్‌ఐకీ చెప్పగా వారు గిరిజనేతరులపైన ఆగ్రహించి ‘మీకెట్లా అడ్డమొస్తారు? వాళ్ళను నరకండి’ అని ఉచిత సలహా ఇచ్చారు. ఇన్ని హామీలు ఇచ్చి చివరికి ఏమీ ఇవ్వని ప్రభుత్వాన్ని పట్టుకొని నిలదీయకపోయారా అని కొండాపురం కోయపెద్దను అడిగితే ‘ఎట్లా పట్టుకునేది? దానికి జుట్టూ జందెం ఉంటేకదా’ అని చమత్కరించాడు.

◆◆◆